క్లుప్తంగా

మండలానికి 1293 ట్యాబ్‌లు మంజూరు



హెచ్‌ఎంలకు ట్యాబులు అందజేస్తున్న ఎంఈఓ శరభయ్య

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ విద్యను పెంపొందించడం కోసం 8వతరగతి విద్యార్థులకు అందజేస్తున్న బైజూస్ ట్యాబులు కోడుమూరు మండలానికి 1293 మంజూరైనట్లు ఎంఈఓ శరభయ్య తెలిపారు. రెండవ విడత కింద మంజూరైన ట్యాబులను శనివారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో అందజేశామని, పాఠశాలలు ప్రారంభమైన వెంటనే విద్యార్థులకు హెచ్‌ఎంలు అందజేస్తారని ఎంఈఓ పేర్కొన్నారు.

చలి వేంద్రం ఏర్పాటు

గూడూరు: మండలంలోని పొన్నకల్లు అయ్యకొండ మిన్నెల్ల స్వామి ఉరుసు సందర్భంగా గూడూరు చైతన్య సేవా సమితి వారు బక్తుల సౌకర్యం కోసం శనివారం చలి వేంద్రం ఏర్పాటు చేశారు. సంస్థ అధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు మాట్లాడతూ గత 28 ఏళ్లుగా మిన్నెల్ల స్వామి ఉరుసు సందర్భంగా భక్తుల సౌకర్యం కోసం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఆచారి, విజయ్, మనోహర్, బజారి తదితరులు పాల్గొన్నారు.

నేడు కె.మార్కాపురంలో ఇళ్ల పట్టాల పంపిణీ

కల్లూరు: మండల పరిధిలోని కె.మార్కాపురం గ్రామంలో ఆదివారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయ అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పేదలకు ఇంటి పట్టాలు అందజేస్తారన్నారు. మండల నాయకులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



కోడుమూరు బాలుర హైస్కూల్లో పరీక్ష గదిలో కూర్చున్న విద్యార్థులు

కోడుమూరు రూరల్: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వతరగతి ప్రవేశానికి గాను శనివారం కోడుమూరులోని బాలుర హైస్కూల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. హైస్కూల్లో ప్రవేశ పరీక్ష రాసేందుకు మొత్తం 364మంది విద్యార్థులను కేటాయించగా, 97మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ తైమూర్‌బాషా తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని గూడూరు డిప్యూటీ తహసీల్దార్ శారద తనిఖీ చేశారు.

రేపు నన్నూరులో ఇళ్ల పట్టాల పంపిణీ

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామానికి చెందిన పేదలకు సోమవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలనే ఉద్దేశంతో జాతీయ రహదారికి ఆనుకొని పూడిచెర్ల సమీపంలో 8 ఎకరాల్లో లేఅవుట్ వేసినట్లు పేర్కొన్నారు. అర్హత గల 873 మంది నిరుపేదలకు మంజూరైన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యేకాటసాని రాంభూపాల్‌రెడ్డి పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



ప్రథమ స్థానంలో నిలిచిన కబడ్డీ జట్టు

గడివేముల: మండల కేంద్రం గడివేముల జెడ్పీ హైస్కూలులో ఆడుదాం ఆంధ్రలో భాగంగా నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు ముగిసినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పోటీ ల్లో క్రీడాకారులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్లు నియోజవర్గ స్థాయిలో ఆడనున్నట్లు తెలిపారు. కాగా కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాట్‌మెంటన్ పోటీల్లో గడివేముల జట్లు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి.

ప్రతి గడపకు కేంద్ర పథకాలు

కర్నూలు (న్యూటౌన్): ప్రతి గడపకు కేంద్ర పథకాలతో పాటు భారతీయ జెండాను చేర్చడం బీజేపీ కార్యకర్తల కర్తవ్యం కావాలని ఏపీ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా వెంకట శివనారాయణ అన్నారు. శనివారం నగరంలోని టీజే కాంప్లెక్స్ ఎదురుగా బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు కనిగిరి నీలకంఠ, ఓబీసీ ప్రధాన కార్యదర్శి మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన సీఎం జగనన్న
- సి.బెళగల్లో పర్యటించిన కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్



సి.బెళగల్ మండలం క్రిష్ణదొడ్డి శ్రీకోనా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ప్రజలతో మాట్లాడుతున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్

సి.బెళగల్: ప్రతికుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ ప్రజల వద్దకే పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరో మారు ఆశీర్వాదించాలని కోరారు. శనివారం కోడుమూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్‌తో కలిసి ఆయన సి.బెళగల్ మండలంలో పర్యటించారు. క్రిష్ణదొడ్డి గ్రామంలోని కొండపై వెలసిన శ్రీ కోనా వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న వారు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ సీఎం జగనన్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచితో మరోసారి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందఅన్నారు. అదేవిధంగా పార్టీ అభ్యర్థులను గెలుపించుకునే బాధ్యత ప్రజలపై, కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ ప్రజలకు మంచి జరగాలంటే మరోసారి తప్పనిసరిగా వైఎస్సార్‌సీపీని ప్రజలు గెలుపించుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలుతో ప్రజలకు చేర్చాలన్న లక్ష్యంతో ప్రత్యక్ష రాజకీయంలోకి వచ్చినట్లు చెప్పారు. అంతకుముందు కుడా చైర్మన్, కోడుమూరు ఇన్‌చార్జ్‌కి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అభిమానలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. బాణాసంచా కాలుస్తూ పూలమాలలతో ఘన స్వాగతించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, నాయకులు పులిరాజు, ముందరింటి వెంకటేష్, శంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, నరసింహుడు, బాయికాటి మద్దిలేటి, మండల కోఆప్షన్ సభ్యుడు హారున్‌రషీద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, యువకులు ఉన్నారు.

ఖాజీ కార్యాలయం ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక విద్యానగర్ మాంటిస్సోరి స్కూల్ సమీపంలో ప్రభుత్వ ఖాజీ కార్యాలయం శనివారం సాయంత్రం ప్రారంభమైంది. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, అమీర్ షరియత్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన హజ్రత్ మౌలానా షా మహమ్మద్ జమలూర్ రెహమాన్ సాహెబ్ దామద్ బర్కత్, ముఫ్తీ మహమ్మద్ ఇనాముల్ హక్ ఖాస్మి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలు కేంద్రంగా ప్రభుత్వ ఖాజీ కార్యాలయం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. న్యాయబద్ధంగా ప్రభుత్వ చట్టాలను అనుసరించి భార్యాభర్తల సమస్యలను ఖాజీ పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ సుధాకర్, రెండో పట్టణ సీఐ ఇంతియాజ్, న్యాయవాదులు, ముస్లిం మత పెద్దలు జుబేర్ మౌలానా, మజీద్ మౌలానా, జాకీర్ మౌలానా, ముఫ్తి షా వలి, ముఫ్తి ఎజాజ్, అబ్దుల్లా హఫీ సాబ్, ముఫ్తి సొహైల్, ముఫ్తి అబ్దుల్ రహమాన్, మౌలానా గౌస్, అబ్దుల్ హుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



ఎద్దుల కృష్ణారెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. గడివేముల మండల పరిధిలోని గని ఉపసర్పంచ్ శివానంద రెడ్డి తండ్రి ఎద్దుల కృష్ణారెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే మతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ను ఓదార్చి ధైర్యం చెప్పారు. అధైర్య పడొద్దని, అన్ని వేళలా పార్టీతో పాటు వ్యక్తిగతంగా తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ ఆర్.బీ చంద్ర శేఖర రెడ్డి,ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచ్ కత్తి తులసమ్మ,వైస్ ఎంపీపీ కాలు నాయక్, నాయకులు దస్తగిరి రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, గని ప్రతాపరెడ్డి, రఘు మాధవరెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు,శ్రీధర్, ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య



సల్కాపురం గ్రామంలో జరుగుతున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల ద్వారా ప్రజల చెంతకే మెరుగైన నాణ్యమైన వైద్యం ఉచితంగా అందిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. శనివారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి సల్కాపురం గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషన్ సేవల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేల ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో వైద్య సేవలు అవసరమైన వారిని గుర్తించి ఫ్యామిలీ ఫిజిషయన్ సేవల కార్యక్రమానికి తీసుకురావలన్నారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వైరస్ వ్యాధులు ప్రబలకుండా వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కంది రైతులు సద్వినియోగం చేసుకోవాలి



అమడగుంట్ల ఆర్‌బీకేలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు : కంది దిగుబడులను ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. శనివారం మండలంలోని అనుగొండ, అమడగుంట్ల, ముడుమలగుర్తి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఏఓ రవిప్రకాష్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు. సివిల్ సప్‌లై శాఖ సహకారంతో ఆర్‌బీకెల ద్వారా రైతుల నుంచి ఆయా గ్రామాల్లోనే కందులను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. లోకల్ మార్కెట్ రేటు ప్రకారం ఏరోజు రేటు ఆ రోజు నిర్ణయించడంతో పాటు, రైతుల నుంచి కొనుగోలు చేసిన కందులకు సంబంధించిన మొత్తాన్ని 48గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తారని ఏఓ పేర్కొన్నారు.

పక్కాగా కులగణన నిర్వహించాలి



పర్ల గ్రామంలో కుల గణన చేస్తున్న సర్వే బృందం



బుధవారపేటలో ..

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కుల గణనను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ రమణమూర్తి సర్వే బృందానికి సూచించారు.మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో జరుగుతున్న కుల గణన సర్వేను శనివారం ఆయన పర్యవేక్షించారు. వివిధ గ్రామాల్లో 949 కుంటుంబాలను సర్వే చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు నమోదు చేయాలని సర్వే సిబ్బందిని ఆదేశించారు.

కులగణన సర్వే ప్రారంభం

కర్నూలు (టౌన్) : నగరంలో శనివారం కులగణన సర్వే ప్రారంభమైంది. సచివాలయాల సిబ్బంది తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా వలంటీర్‌తో సంబంధం లేకుండా సచివాలయ సిబ్బంది వ్యక్తిగత చిరునామా, కుటుంబ సభ్యుల సంఖ్య, వివాహం జరిగిందా లేదా మతం, ఉపకులం, రేషన్ కార్డు, విద్యార్హత, ఇంటి రకం, నివాస స్థల విస్తీర్ణం, వంటగ్యాస్, తాగునీటి సదుపాయం వంటి అనేక సామాజిక ఆర్థిక కుల వివరాలు నమోదు చేస్తున్నారు. సర్వే సిబ్బందికి నగరపాలక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తున్నారు. 10 రోజుల వ్యవధిలో కులగణన పూర్తి చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరంలో సర్వే ముమ్మరం చేసినట్లు నగర పాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ తెలిపారు. ప్రతి ఒక్కరు విధిగా సర్వేలో పాల్గొని వివరాలు తెలియజేయాలని చెప్పారు.

కోట్ల వర్సెస్ విష్ణు

- అనుచరులకు టిక్కెట్ విషయంలో రాజకీయ రగడ
- తీవ్రస్థాయికి చేరిన వర్గపోరు

కోడుమూరు : కోడుమూరు టికెట్ కోసం తెలుగుదేశం పార్టీలో రాజకీయ రగడ మొదలైంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెండు గ్రూపులుగా విడిపోయారు. వర్గపోరు తీవ్ర స్థాయికి చేరింది. సైకిల్ రెండుభాగాలైందనే గుసుగుసలు మొదలయ్యాయి. మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలున్నాయి. ఓ దశలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇద్దరిని రాజీ చేసే ప్రయత్నం చేసినా బెడిసికొట్టింది. తాను చెప్పిన వారికే టికెట్ ఇవ్వాలంటూ కోట్ల సూర్య, ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి పట్టుబడుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి.... తాను మద్దతు ఇచ్చే బొగ్గుల దస్తగిరికి కోడుమూరు టికెట్ వస్తుందని ముందుగానే గ్రామాల్లో పర్యటనలు చేయిస్తూ ప్రచారం మొదలుపెట్టాడు. కర్నూలు మండలంలోని కొంతలపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్న కోట్ల వర్గీయులపై విష్ణు అనుచరులు గత నాలుగు రోజుల కిందట దాడి చేసి నారాయణ అనే వ్యక్తిని గాయపరిచారు. ఈ విషయంపై అధిష్టానికి కోట్ల వర్గీయులు ఫిర్యాదు చేశారు. కోట్ల స్వగ్రామమైన లద్దగిరిలో బొగ్గుల దస్తగిరి, ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కోట్ల వర్గీయులు చించివేసి తగులబెట్టారు. ఇలా గ్రామంల్లో కోట్ల, విష్ణు వర్గీయులు గ్రూపులుగా విడిపోయి దాడులు చేసుకుంటున్నారు. ఫ్యాక్షన్ ముఠాల తరహాలో వీరిద్దరి మధ్య కొనసాగుతున్న గొడవను చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎన్నికల్లో ఇరు వర్గాలకు తగిన గుణపాఠం చెబుతామని చెబుతున్నారు.

అవీ-ఇవీ

నేడు కొత్తపేట సీతారాములకు అభిషేకం

కర్నూలు (న్యూటౌన్): అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా నగరంలోని కొత్తపేట శ్రీరామాలయంలో ఈ నెల 21వ తేదీ ఉదయం 10గంటలకు సీతారాముల అభిషేకం, సహస్రనామ అర్చన, హనుమాన్ చాలీసా, శ్రీరామ పట్టాభిషేకం జరుగుతుందని కార్తీకదీపోత్సవ సమితి నిర్వాహకులు ఇ పద్మావతి, ఇ మల్లికార్జునరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగరంగ వైభవంగా జరగనున్న శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు తరలిరావాలని వారు కోరారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబారు

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ డిగ్రీ 3,5 సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. శ్రీశైలం డిగ్రీ కాలేజీలో ఒక్కరు, కర్నూలు ఎస్టీబీసీ కాలేజీలో మరొకరు డిబార్ అయ్యారు. కాగా, శనివారం పరీక్షలకు 6,082 మందికి గాను 5,464 మంది హాజరయ్యారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ తరగతులు

కర్నూలు (లీగల్) : జిల్లా కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహ ర్, ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ ఎం .హుసేన్ బాషా పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. జేజేబీ, ఆక్ట్, పోక్సో ఆక్ట్, ప్లీ బార్గేనింగ్, వినియోగదారుల చట్టం, అరెస్టు, ప్రీ అరెస్టు, రిమాండ్ స్టేజ్ తదితర వాటి గురించి పారా లీగల్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం జెండర్ సెన్సిటైజేషన్, లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై వర్క్‌షాప్ నిర్వహించారు. సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగభూషణం నాయుడు మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, నేరాలు పోష్ యాక్ట్ కిందకు వస్తాయని, పనిచేసే ప్రదేశంలో ఎలాంటి ఇన్సిడెంట్స్ జరిగినా కమిటీ/సెల్‌కి తెలియజేయాలన్నారు. నిందితులపై 160 రోజుల లోపు విచారణ చేసి, శిక్షను అమలు చేస్తామన్నారు. తర్వాత లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. బాలిక రక్షణ, చదివించే బాధ్యతపై ప్రతిజ్ఞ చేయించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఆటోలు సీజ్

కర్నూలు : ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వ్యవహరిస్తే ఆటోలు సీజ్ చేస్తామని రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా హెచ్చరించారు. కర్నూలు కార్పొరేషన్ కార్యాలయం పక్కనున్న ఆటోస్టాండ్ ఆటోడ్రైవర్లకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా ఆటోలు నిలపవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు ఆటోలను ఒకటి వెనుక ఒకటి లైన్‌లో క్యూ పద్ధతి పాటించాలని సూచించారు. అలాగే కర్నూలు, తెలంగాణ ఆటోడ్రైవర్ల మధ్య కూడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేలా క్రమశిక్షణ పాటించాలని, గొడవలు పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హోరాహోరీగా సాగిన క్రికెట్ పోటీలు



ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి విజేతలకు క్రీడా కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు



సి.బెళగల్‌లో మండల స్థాయి క్రికెట్ పోటీల విజేత సి.బెళగల్ జట్టు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో భాగంగా జరిగిన మండల స్థాయి క్రికెట్ పోటీల హోరాహోరీగా సాగాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, పీడీలు వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర నిర్వహించారు. శనివారం సెమీ ఫైనల్, ఫైనల్ పోటీల సందర్భంగా సందర్భంగా క్రీడాకారులను ఎస్ఐ మన్మథ్‌విజయ్, అధికారులు పోటీలను ప్రారంభించారు. మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో పలుకుదొడ్డి జట్టుపై పోలకల్ - 2 జట్టు విజయం సాధించిది. అదేవిధంగా సి.బెళగల్ - 2, కంబదహాల్ జట్ల మధ్య జరిగిన రెండవ సెమీఫైనల్ మ్యాచ్‌లో సి.బెళగల్ - 2 జట్టు ఫైనల్‌కు చేరుకుంది. మండల స్థాయి క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ విజేతలకు మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సుంకరావు, రాఘవేంద్ర, లక్ష్మిరమణ, సత్యకుమార్, చక్రపాణిని ఘనంగా సన్మానించారు. విజేత జట్లను ఎంపీపీ బొంతల మునెప్ప, సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న తదితరులు అభినందించారు.



ఖోఖో క్రీడలో ఇరుజట్లు తలపడుతున్న దృశ్యం

ఖోఖో పోటీల్లో ఉయ్యాలవాడ జట్టు విజయం

ఓర్వకల్లు: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా శనివారం జరిగిన ఖోఖో పోటీల్లో ఉయ్యాలవాడ జట్టు విజయం సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ హరిప్రసాద్ తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన మండల స్థాయి ఖోఖో పోటీల్లో మొత్తం ఆరు జట్లు పాల్గొనగా, అందులో మీదివేముల జట్టుపై ఉయ్యాలవాడ జట్టు గెలుపొందింది. ఈ జట్టు నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు.

క్రైం కార్నర్


రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి



మృతిచెందిన షేక్ అస్లాం

కర్నూలు : కర్నూలు-హైదరాబాదు రోడ్డులోని ఆటోనగర్‌కు ఎదురుగా (ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్ వద్ద) జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం తుముకూరు జిల్లా చిక్కనహల్లి గ్రామానికి చెందిన షేక్ అస్లాం (27) మృతిచెందారు. బొలెరో వాహనంలో పచ్చి టెంకాయలతో తుముకూరు నుంచి హైదరాబాదుకు వెళ్తుండగా కర్నూలు శివారులో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ పవన్ తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో కల్వర్టును ఢీకొట్టడంతో వాహనంలో ఎడమవైపు కూర్చున్న షేక్ అస్లాం తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయనకు భార్యతో పాటు ఒక కూతురు సంతానం. మృతుడి సోదరుడు సయ్యద్ అబ్రార్ ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్ పవన్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన గొల్ల కృష్ణ (ఫైల్)

కర్నూలు : ఆస్పరి మండలం కారుమంచి గ్రామానికి చెందిన గొల్ల కృష్ణ (40) అదృశ్యమయ్యాడు. ఈయన కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధ పడుతుండటంతో ఈనెల 9వ తేదీన ప్రభుత్వా సుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ 10వ తేదీ రాత్రి 10:30 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లాడు. అతని కోసం కర్నూలు నగరంతో పాటు చుట్టుముట్టు గ్రామాల్లో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా కనిపించలేదు. ఆసుపత్రి నుంచి బయటకెళ్లినప్పుడు తెలుపు రంగు చొక్కా, ఆకుపచ్చ పంచ ధరించాడు. తల్లి గొల్ల నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

అవంతి నగర్‌లో అగ్నిప్రమాదం

కర్నూలు : స్థానిక వెంకటరమణ కాలనీ శివారులోని అవంతి నగర్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కాలనీలోని అవంతి స్కీన్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెం .107లో అజయ్‌కుమార్ నివాసముంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కరెంటు పోవడంతో కొవ్వొత్తి వెలిగించి ఫ్రిజ్‌పై పెట్టి పడక గదిలో నిద్రపోయాడు. కొవ్వొత్తి కరిగి ఫ్రిజ్‌కి మంట తాకడంతో ఫ్రిడ్జ్‌కి ఉన్న సిలిండర్ వేడికి పేలిపోయింది. ఫ్రిడ్జ్‌తో పాటు పక్కనున్న వస్తువులు కూడా కాలిపోయాయి. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ఫ్రిడ్జ్‌తో పాటు కొన్ని వస్తువులు కాలిపోయాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని కొణిదేడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. కొణిదేడుకు చెందిన ఉసేన్‌సా బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ ఘటనలో గాయపడిన ద్విచక్రవాహనదారుడిని చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రైవేటు బస్సు



దెబ్బతిన్న ప్రైవేటు బస్సు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని జాతీయ రహదారిపై ఎస్సార్బీసీ కాల్వ వద్ద ట్రాక్టర్‌ను ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో చందమామ హోటల్ వద్ద బియ్యం బస్తాలతో ట్రాక్టర్ పాణ్యం వైపు వెళ్తుంది. తెలంగాణకు చెందిన టీఎస్08 యూఎల్ 3388 నెంబరు గల ప్రైవేటు ట్రావెల్ బస్సు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీనడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న వెంకటేశ్వర్లు, సిద్ధం సుబ్బారెడ్డి, సలాంబాషాతో పాటు బస్సు డ్రైవర్ నాగేష్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాలకు తరలించారు. కాగా బస్సు ట్రాక్టర్‌ను ఢీకొన్న తర్వాత డివైడర్ ఎక్కి ఎడమ నుంచి కుడి వైపు వెళ్లడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ఆ సమయంలో వేరే వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు డ్రైవర్ అజాగ్రత్తే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు.

బాలికలను పరిరక్షించుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఆడపిల్లలే ఇంటికి వెలుగు అని, వారిని సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా నోడల్ అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం టౌన్ మోడల్ పాఠశాలలో బాలిక సంరక్షణపై విద్య, వైద్యారోగ్యధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆడ పిల్లలను సంరక్షించుకుంటే భవిష్యత్ బంగారు బాతులాగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు బాలిక సంరక్షణపై వ్యాస, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో డెమో ఆఫీసర్లు ప్రమీళాదేవి, చంద్రశేఖరరెడ్డి, ప్రోగ్రామ్ కన్సల్టెంట్ సుమలత, డీసీఈబీ సెక్రటరీ బి.నాగరాజు, సైన్స్ టీచర్లు రాజశేఖర్, స్నేహలత పాల్గొన్నారు.

నేడు రోల్ అబ్జర్వర్ రాక

కర్నూలు(సెంట్రల్) : ఎస్ఎస్ఆర్-2024లో సమీక్ష కోసం రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్‌రెడ్డి రానున్నారు. ఆయన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల అధికారులతో నిర్వహించే సమీక్షలో పాల్గొంటారు. 22వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల కానున్న నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశమవుతారు.